క్లుప్తంగా

అమ్మవారికి పవిత్ర జలాలతో మహాభిషేకం



నగరంపాలెం: స్థానిక సంపత్ నగర్ శ్రీ శృంగేరి శంకర మఠంలోని శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం అమ్మవారికి పంచ నదుల నుంచి సేకరించిన జలాలతో మహాభిషేకాన్ని నిర్వహించారు. పంచ గంగోదకం, పంచామృతాలు, ఫలరసాలు, పసుపు, కుంకుమ, భస్మం కలిపిన పవిత్ర జలాలతో మహాభిషేకం చేపట్టారు. సాయంత్రం పుష్పాలతో చేసిన విశేష అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమాల్ని ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు, పోలిశెట్టి శ్యాంసుందర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

రసవత్తరంగా శాస్త్రీయ సంగీత పోటీలు



నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం శ్రీత్యాగరాజ కళావేదికపై బుధవారం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో రెండో విడత శాస్త్రీయ సంగీత పోటీలు జరిగాయి. సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్, ఉపాధ్యక్షులు గిరిజాశంకర్ పోటీలను పర్యవేక్షించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో పలువురు పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. విజేతలకు వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. న్యాయ నిర్ణేతగా ప్రముఖ కర్నాటక సంగీత విద్వాంసులు మల్లాది సూరిబాబు వ్యవహరించగా, కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ పర్యవేక్షించారు.

విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తు

రెండో రోజు సత్యాగ్రహ దీక్షలో జంగాల



లక్ష్మీపురం: విశాఖ ఉక్కు ఆంధ్రుల సొత్తు అని, రాష్ట్రానికి తలమానికమైన పరిశ్రమను ప్రైవేటీకరించే కుట్రలు ఇక ఆపాలని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు జంగాల అజయ్‌కుమార్, సీఐటియూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద బుధవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట వేదిక ఇచ్చిన పిలుపులోభాగంగా కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం సత్యాగ్రహ దీక్షను అజయ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించి పరిశ్రమను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరారు. విశాఖ ఉక్కు పరిశ్రమ నష్టాలకు కారణం కేంద్ర ప్రభుత్వ విధానాలేనని ఆయన స్పష్టం చేశారు.

వృద్ధులను అక్కున చేర్చుకోవడం అభినందనీయం



నెహ్రూనగర్: వృద్ధులను అక్కున చేర్చుకుంటున్న సీఆర్ఆర్ మూర్తి వృద్ధుల సేవా సంస్థ నిర్వాహకులు అభినందనీయులని గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. పాత గుంటూరు యాదవుల బజార్‌లోని వృద్ధాశ్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. వృద్ధులకు ఆహారాన్ని అందించి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సమాజంలో వివిధ కారణాలతో ఒంటరి పాలైన వృద్ధులను ఆదరించి ఆశ్రయం కల్పించిన నిర్వాహకుల్ని అభినందించారు.

40 ఏళ్లలో వందసార్లు రక్తదానం



గుంటూరు ఎడ్యుకేషన్: 40 ఏళ్లలో వంద సార్లు రక్తదానం చేసిన గుంటూరు నగరానికి చెందిన మిర్చి వ్యాపారి పోలిరెడ్డి ఉమామహేశ్వరరావును ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్ర రాజు అభినందించారు. కలెక్టర్ బంగ్లా రోడ్డులోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రామచంద్రరాజు మాట్లాడుతూ.. అనేక మంది ప్రాణాలు కాపాడటంతోపాటు కొవిడ్ సమయంలో రెడ్ క్రాస్ వలంటీర్‌గా ఉమామహేశ్వరరావు సేవలు అందించారని తెలిపారు. ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం మన ధర్మం అని తెలిపారు.

గాంధీజీ మార్గం యువతకు స్ఫూర్తిదాయకం

మేయర్ కావటి

నెహ్రూనగర్: జాతిపిత మహాత్మాగాంధీ అహింస అనే ఆయుధంతో భారత దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చారని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పేర్కొన్నారు. మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలను పురస్కరించుకొని నగర పాలక సంస్థ కార్యాలయంలోని గాంధీ విగ్రహానికి, హిమని సెంటర్ వద్ద గల గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ దేశ స్వాతంత్య్ర సాధనకు ఎన్నో ఉద్యమాలను అహింసా మార్గంలో చేశారని, ఆయన స్ఫూర్తితో ఎంతోమంది స్వాతంత్య్ర పోరాటంలో పాల్గొన్నారని తెలిపారు. మద్యపానం, అంటరానితనం, జాత్యహంకారం వంటి దురాగతాలపై ఎంతగానో పోరాటం చేశారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరిలో స్వాతంత్య్ర కాంక్షను రగల్చడానికి దేశం మొత్తం తిరిగారని, ఆయనను ఎన్నో సార్లు జైలులో కూడా ఖైదు చేశారని తెలిపారు. అహ్మదాబాద్ నుంచి దండి వరకు సుమారు 400 వందల



గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కన్న మాస్టారు

కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఉప్పు సత్యాగ్రహాన్ని విజయవంతం చేసి, ఎంతో మంది ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. క్విట్ ఇండియా, సహాయ నిరాకరణోద్యమాల ద్వారా ప్రజలను చైతన్య పరచి, స్వాతంత్య్రం వైపు అడుగులు వేసేలా కృషి చేశారని తెలియజేశారు. నేటి యువత కూడా గాంధీ చూపిన అహింసా మార్గంలో నడవాల్సిన అవసరం ఎంతైన ఉందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కార్పొరేటర్ మహమ్మద్ అబిద్ బాషా, డెప్యూటీ కమిషనర్లు డి. శ్రీనివాసరావు, మేనేజర్ ప్రసాద్, ఈఈ సుందరరామిరెడ్డి, నగర పాలక సంస్థ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● మహాత్ముని అడుగుజాడల్లో నడవడమే నిజమైన నివాళి

గుంటూరు ఎడ్యుకేషన్: మహాత్ముల అడుగుజాడల్లో నడవడమే వారికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని ఏఎన్‌యూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వి.దివ్యతేజో మూర్తి పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో బుధవారం మహాత్మాగాంధీ, లాల్ బహ



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇతర అధికారులు

దూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దివ్య తేజో మూర్తి మాట్లాడుతూ భారత మాత ముద్దు బిడ్డల్లో మహాత్మా గాంధీ అగ్రగణ్యుడని పేర్కొన్నారు. అహింస, శాంతి, సత్యాగ్రహం, సహాయ నిరాకరణ వంటి సాధనాలతో బ్రిటిష్ ప్రభుత్వాన్ని అధికారంలో నుంచి దింపి భారతదేశ స్వాతంత్య్రంలో కీలక పాత్ర పోషించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ జై జవాన్, జై కిసాన్ నినాదంతో లాల్ బహదూర్‌శాస్త్రి సమైక్యతను చాటి చెప్పారని తెలిపారు. మచ్చలేని రాజకీయం, స్వచ్ఛ రాజకీయాలతో ప్రజా సేవకునిగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ యస్. అనితా దేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, గుంటూరు జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుధీర్ కుమార్, ఎన్ఎస్ఏ అధికారి ఆర్.జయ శైలజ, ఇంటర్ ఇన్‌చార్జ్ జి. సురేష్ కుమార్, అధ్యాపకుడు వేణుగోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

● సత్యం, అహింసతోనే గాంధీ స్వాతంత్య్ర సాధన



సెయింట్ లారెల్స్ స్కూల్లో నివాళులర్పిస్తున్న రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: సత్యం, అహింసను ఆయుధంగా చేసుకుని మహాత్మాగాంధీ దేశానికి స్వాతంత్య్రాన్ని సాధించారని కన్న ఇంగ్లిషు మీడియం స్కూల్



సుమేధ హైస్కూల్లో ఉపాధ్యాయులతో చంద్రశేఖర్ రెడ్డి

డైరెక్టర్ కన్న మాస్టారు పేర్కొన్నారు. రైలుపేటలోని స్కూల్లో బుధవారం మహాత్మా గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కన్న మాస్టారు మాట్లాడుతూ దేశ ప్రధానిగా నిస్వార్థమైన సేవల్ని అందించిన లాల్ బహదూర్ శాస్త్రిని మరువరాదన్నారు. గాంధీ, శాస్త్రి వంటి మహనీయులను నిత్యం స్మరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● మహాత్ములను నిత్యం స్మరించుకోవాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జాతిని ముందుకు నడిపిన మహాత్ములను నిత్యం స్మరించుకోవాలని సుమేధ హైస్కూల్ డైరెక్టర్ మున్నంగి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్జీవో కాలనీలోని హైస్కూల్లో బుధవారం గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ మహనీయుల త్యాగాలను భావి తరాలకు అందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు

గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని బాపూజీ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చలమయ్య జూనియర్, డిగ్రీ కళాశాలతో పాటు ఇంగ్లిషు మీడియం పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకల్ని నిర్వహించారు. ఈసందర్భంగా బాపూజీ కమిటీ కార్యదర్శి కర్పూరపు రామకృష్ణ ప్రభువు మాట్లాడుతూ నాటి బ్రిటిష ప్రభుత్వ దాస్య శంఖలాల నుంచి దేశాన్ని విడిపించి, మనకు స్వేచ్ఛ, వాయువులను అందించిన గొప్ప మహనీయుడు బాపూజీ అని కొనియాడారు. కమిటీ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణ మాట్లాడుతూ అందరం ఆయన అడుగుజాడల్లో నడవడమే నిజమైన నివాళి అని అన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జయంతిని ఐక్యరాజ్య సమితి ప్రపంచ అహింసా దినంగా ప్రకటించిందని, తద్వారా ఆయన ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన గొప్ప వ్యక్తి అని అన్నారు. విద్యాసంస్థల ప్రతినిధులు ఆర్.సాంబశివరావు, వై.వి.ఎస్. ప్రసాద్, గోపాలకృష్ణమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ.శ్రీధర్, కల్చరల్ కో–ఆర్డినేటర్ మధుసూదన్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ ఇంగ్లిష మీడియం స్కూల్లో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మేకల రవీంద్రబాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● జిల్లా బార్ అసోసియేషన్ హాలులో..



మాట్లాడుతున్న బార్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి

నగరంపాలెం: మహాత్మా గాంధీ ఆశయాల సాధన కోసం అందరూ కృషి చేయాలని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని అసోసియేషన్ హాలులో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, అసోసియేషన్ కార్యదర్శి ఇందిర, ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేడు, రేపు న్యాయవాదులు విధుల బహిష్కరణ

కేంద్ర ప్రభుత్వం అడ్వకేట్స్ యాక్ట్‌లో చేపడుతున్న మార్పులకు వ్యతిరేకంగా గురు, శుక్రవారాల్లో విధులు బహిష్కరించనున్నట్లు గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి తెలిపారు. ఈ చట్టం న్యాయవాదులకు వ్యతిరేకంగా ఉందని, జిల్లాలోని అన్ని కోర్టుల్లోని విధుల్ని బహిష్కరించనున్నారని ఆయన చెప్పారు.

● మహాత్ముని జీవితం ఆదర్శనీయం

గుంటూరు ఎడ్యుకేషన్: మహాత్ముని జీవితం ఆదర్శనీయమని జైన్ హైస్కూల్ డైరెక్టర్ డాక్టర్ మొహమ్మద్ మున్ను పేర్కొన్నారు. సంగడిగుంటలోని పాఠశాలలో బుధవారం మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్ను మాట్లాడుతూ మహాత్మా గాంధీ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని, ఆయన కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ, ఉపాధ్యాయులు అనూష, శ్రీదేవి, అఖిల, గాయత్రి, షబీనా పాల్గొన్నారు.

● మహాత్ముని కలలను సాకారం చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: మహాత్ముని కలలను సాకారం చేసే బాధ్యత కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ అన్నారు. బుధవారం డీఈవో కార్యాలయంలో మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఈవో శైలజ మాట్లాడుతూ మహనీయుల ఆశయాలకు అనుగుణంగా అందరూ నడుచుకోవాలని తెలిపారు. ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసిం మాట్లాడుతూ మహాత్మా గాంధీ సత్యం, అహింస లను ఆయుధాలుగా మార్చి స్వాతంత్య్రాన్ని సాధించారని, జై జవాన్.. జై కిసాన్ అనే నినాదంతో లాల్ బహదూర్ శాస్త్రి దేశ సమైక్యత కోసం పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది గణేష్, నరేష్, సుబ్బారావు, మనోహర్, శ్రీనివాసరావు, సాయి, శివ, హసన్ బేగ్ పాల్గొన్నారు.

● జీజీహెచ్‌లో ఘన నివాళులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ కలలు గన్న స్వచ్ఛభారతవనిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో న్యూరాలజీ విభాగం హెచ్ఓడీ డాక్టర్ అరుణకుమారి, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ సతీష్ కుమార్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎండీ మున్ను, కనకదుర్గ



టీజేపీఎస్ కళాశాలలో గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించిన దివ్యతేజోమూర్తి, సిబ్బంది



గాంధీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న డీఈవో శైలజ, ఖాసిం తదితరులు

మత సామరస్యమే గాంధీ జీవిత సందేశం

నగరంపాలెం: మత సామరస్యమే జాతిపిత మహాత్మా గాంధీ జీవిత సందేశమని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అన్నారు. గాంధీ 155వ జయంతి వేడుకల్లో భాగంగా బుధవారం లాలాపేటలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ నేడు దేశంలో అనేక కులాలు, మతాలు, తెగలు ఐక్యంగా జీవించేందుకు మహాత్మా గాంధీ కృషే కారణమని తెలిపారు. తారతమ్యాలు లేని దేశాన్ని చూడాలని గాంధీజీ కోరుకున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం దేశ ప్రజలంతా ఆర్థిక, సామాజిక సమానత్వంతో జీవిస్తారని మహాత్మాగాంధీ ఆశించారని తెలిపారు. అయితే, నేటి పాలకులు ప్రజల ఆస్తులైన ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తూ, నిరుద్యోగాన్ని పెంచారని ఆరోపించారు. దీనిపై దృష్టి మరలిచేందుకు మతతత్వ విధానాలను అనుసరిస్తున్నారని వాపోయారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కన్న విద్యా సంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు, కాపు నాయకులు మాదా రాధా, దాసరి జాన్ బాబు, రాజపుత్ర సత్యంసింగ్, మాజీ కార్పొరేటర్ మందాడి సుబ్బారావు, పుసులూరు విజయ్‌కుమార్, సంఘ సేవకులు బత్తుల కోటేశ్వరరావు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గాంధీజీకి నివాళులర్పిస్తున్న రామకృష్ణ ప్రభు, సూర్యనారాయణ, శ్రీనివాసరావు

బజరంగ్ కార్యాలయంలో ఘన నివాళి



మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు: మహాత్మగాంధీ బోధించిన సత్యాగ్రహం, అహింస, శాంతి వంటి మార్గాలు మానవాళిని ప్రభావితం చేశాయని బజరంగ్ అర్బన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. గుంటూరులోని బజరంగ్ కార్యాలయంలో జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గాంధీ తత్వం మానవాళి మనుగడకు అనుసరణీయమని తెలిపారు. శాంతి, అహింసలే ప్రపంచ మానవ సమాజాన్ని కాపాడతాయని పేర్కొన్నారు. దేశ ప్రధానిగా లాల్‌బహదూర్ శాస్త్రి సేవలు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మహనీయులను స్మరించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో బజరంగ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టిగా ముందుకు.. సమస్యలపై పోరుకు సిద్ధం

వైఎస్సార్ సీపీ పశ్చిమ కార్పొరేటర్ల నిర్ణయం



సమావేశమైన పశ్చిమ నియోజకవర్గ కార్పొరేటర్లు

నెహ్రూనగర్: ఓవైపు సమగ్రాభివృద్ధి, ప్రజా సంక్షేమంతో కూడిన గుంటూరు నగర సుస్థిరత కోసం పాటుపడుతూనే... మరోవైపు కలిసికట్టుగా పార్టీని మరింత పటిష్టం చేయాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఏకగ్రీవంగా తీర్మానించారు. మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు వైఎ.స్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలు, ఆశయాలకు అనుగుణంగా.. స్థానిక పార్టీ పెద్దల ఆదేశాలకు లోబడి.. ఒకటే మాట.. ఒకటే బాటగా ముందుకు సాగాలని సమిష్టిగా నిర్ణయించారు. ఈ మేరకు కొండా వెంకటప్పయ్య కాలనీలోని కార్పొరేటర్ కాంద్రకుంట గురవయ్య కార్యాలయంలో సమావేశమైన కార్పొరేటర్లు తొలుత తమ డివిజన్ల పరిధిలో ఇప్పటివరకు జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాల గురించి పరస్పరం సమగ్రంగా చర్చించుకున్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన తర్వాత తమ డివిజన్లలో మందగించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షించుకున్నారు. దీనిపై పెద్ద ఎత్తున నిరసన గళం విప్పాలని.. అవసరమైతే ఆందోళన బాట పట్టాలని ఆలోచన చేశారు. అయితే, దీనికి ముందుగా ఆయా డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న ప్రగతి పనుల వివరాలతో గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులును కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళాలని నిర్ణయించారు. ప్రధానంగా తెలుగుదేశం ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పూర్తి నిర్లక్ష్యంగా నత్తనడకన నడుస్తున్న పనులను వేగవంతం చేయాలని ఆయనను కోరాలన్నది వారి వ్యూహంగా తెలుస్తోంది. ఈ మేరకు గురువారం ఉదయం కమిషనర్ పులి శ్రీనివాసులును వారంతా ఉమ్మడిగా కలిసి నివేదించనున్నారు. ఇక ఇదే సమావేశంలో డివిజన్లలో నెలకొన్న పార్టీ పరిస్థితిపై కార్పొరేటర్లు లోతైన అధ్యయనం చేశారు. దీనిపై స్థానిక పార్టీ పెద్దల సూచనలు, సలహాల మేరకు ఏ విధంగా పార్టీని మరింత బలోపేతం చేయాలనే దానిపై ఒక నిర్ణయం తీసుకోవాలన్న నిర్ధారణకు వచ్చారు. సమావేశంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి), షేక్ రోషన్, అచ్చాల వెంకటరెడ్డి, కాంద్రకుంట గురవయ్య, యక్కలూరి మారుతి కోటి లింగారెడ్డి, బోడపాటి ఉషా కిషోర్, పడాల సుబ్బారెడ్డి, అందుగుల సంతోష్, వలి వీరారెడ్డి, మార్కెట్ బాబు, ఉడుముల లక్ష్మీ శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

కళాశాలలు పెట్టిన వారిపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

లక్ష్మీపురం: జిల్లావ్యాప్తంగా గాంధీ జయంతి రోజున తెరిచిన ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. కిరణ్ డిమాండ్ చేశారు. స్థానిక బ్రాడీపేటలోని బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వల్ల పాఠశాలలు, కళాశాలలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మూడో తేదీ నుంచి దసరా సెలవులు ప్రారంభం అయితే మన గుంటూరు జిల్లాలో మాత్రం ఐదో తేదీ నుంచి ప్రారంభమవుతాయి అంటూ వస్తున్న వార్తలను డీఈఓ, ఆర్ఐఓ సమాధానం చెప్పాలని ఆయన కోరారు.

దర్యాప్తు నైపుణ్యాన్ని పెంచుకోవాలి



లక్ష్మీపురం: సిబ్బంది దర్యాప్తు నైపుణ్యాన్ని పెంచుకోవాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ముందుగా స్టేషన్ ఆవరణను, పలు రికార్డులను పరిశీలించారు. స్టేషన్ మరమ్మతులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసి తక్షణమే అందజేయాలని అధికారులకు సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా నడుచుకోవాలని ఆదేశించారు. పెండింగ్ కేసులకు దోహదపడే దర్యాప్తు విధానాలపై పలు సూచనలు, సలహాలను స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలియజేశారు. కార్యక్రమంలో గుంటూరు వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ జయరాం ప్రసాద్ పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం

లక్ష్మీపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పిలుపుమేరకు మహాత్మాగాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నేతలు వినతి పత్రం అందించారు. గాంధీకి ఘనమైన నివాళులు అర్పిస్తూ వినూత్నంగా మార్కెట్ సెంటర్‌లోని విగ్రహానికి వినతిపత్రం అందజేసినట్లు మాజీ శాసన సభ్యుడు షేక్ మస్తాన్‌వలి తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రజా సంక్షేమాన్ని పక్కనపెట్టి కేవలం ప్రచారానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుందని విమర్శించారు. తిరుపతి లాంటి పవిత్ర పుణ్యక్షేత్రంలో కూడా ప్రసాదమైన లడ్డూను కూడా రాజకీయ కోణాన్ని చూపిస్తున్నటువంటి దుర్మార్గ ఆలోచన విధానాన్ని సుప్రీంకోర్టు మొట్టికాయ వేసినప్పటికీ కూడా చలనం రాలేదని విమర్శించారు. భారత జాతీయ ఐక్యత కోసం పోరాడుతున్న యువ నాయకుడు రాహుల్ గాంధీకి శక్తినివ్వాలని కోరుతూ గాంధీకి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రత్తయ్య, ఖలీల్ అహ్మద్, షేక్ కరీం, మోషే, బుజ్జి, జానీ పాల్గొన్నారు.

గాంధీ, శాస్త్రిలకు ఘన నివాళి

మేడికొండూరు మండలం పేరేచర్ల గాంధీబొమ్మ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్, రైతులు, గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.